క్లుప్తంగా

ఘనంగా బొడ్రాయి ఉత్సవాలు



బొడ్రాయికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

షాబాద్‌: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ సర్పంచ్ శివకుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని నాగరకుంటలో బొడ్రాయి ప్రతిష్ఠించి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం నుంచే బొడ్రాయికి పూజలు చేసి, సాయంత్రం బోనాలతో నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు గజేందర్‌గౌడ్, మల్లయ్య, సత్యనారాయణరెడ్డి, జంగయ్య, మధు ఉన్నారు.

ఏసీపీకి సన్మానం



లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: నూతన ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మీనారాయణను సోమవారం పలువురు కాంగ్రెస్ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మాజీ కౌన్సిలర్ సర్వర్‌పాషా, నాయకులు మహ్మద్ ఇబ్రహీం ఉన్నారు.

పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జిల్లా పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులు, సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా తగిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. అదేవిధంగా కొత్తగా చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఇప్పటికే టెండర్లు పూర్తయిన వాటిని వెంటనే చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ శ్రీరామ్ రాములు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు అందించాలని వినతి

కేశంపేట: బీజేపీ సాంస్కృతిక శాఖ జిల్లా కన్వీనర్ కర్రెడ్ల నరేందర్‌రెడ్డి సోమవారం ఎంపీ డీకే అరుణను కలిశారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి నిధులు విడుదల చేయాలని వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని సంతాపూర్ గ్రామంలో హైమాస్ట్ లైట్లు, సీసీరోడ్డు నిర్మాణాలకు నిధులను అందించాలని కోరినట్లు తెలిపారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాలకు ఎంపీ నిధులను విరివిగా అందించాలని కోరినట్లు వెల్లడించారు. మండలంలో అభివృద్ధి పనులకు నిధులు అందిస్తానని ఆమె హామీ ఇచ్చినట్లు తెలిపారు.

కష్టపడి పనిచేసిన వారికి పదవులు

చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి భీంభరత్

షాబాద్‌: పార్టీ బలోపేతానికి పనిచేసిన కార్యకర్తలకు తప్పకుండా పార్టీ పదవులు లభిస్తాయని చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డితో కలిసి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఆహర్నిశలు కృషి చేసిన వారిని పార్టీ అధిష్టానం గుర్తించి పదవులు ఇస్తుందన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య పార్టీ కార్యకర్తలను విస్మరిస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. ఇటీవల జరిగిన మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా ఉంటేనే విజయం సాధిస్తామన్నారు. ఎవరికి వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ పార్టీకి చెడ్డపేరు తీసుకురావొద్దని కోరారు. కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ మల్లేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి భార్గవ్‌రామ్, మాజీ ఎంపీటీసీ అశోక్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



షాద్‌నగర్‌రూరల్: జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు



చేవెళ్ల: జెండాకు వందనం సమర్పిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు



చేవెళ్ల: పీఏసీఎస్ కార్యాలయం వద్ద..

అంబరాన్నంటిన ఆవిర్భావ సంబురం

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను సోమవారం చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల కార్యాలయాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ సంఘాల నేతలు జాతీయ జెండాలను ఆవిష్కరించి, వందనం సమర్పించారు. పలుచోట్ల మహాత్మా గాంధీ, ప్రొఫెసర్ జయశంకర్, తెలంగాణ తల్లి విగ్రహాలు, అమరుల స్తూపాల వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్నో పోరాటాలు, ఉద్యమకారుల త్యాగాలతోనే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని కొనియాడారు.



మొయినాబాద్: పీఏసీఎస్ కార్యాలయం వద్ద..



కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ



కేశంపేట: తహసీల్దార్ కార్యాలయం వద్ద..



మొయినాబాద్‌రూరల్: జెండా ఆవిష్కరణలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు



షాబాద్‌: ఎంపీడీఓ కార్యాలయం వద్ద..



కొత్తూరు: జెండాకు వందనం సమర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ లావణ్య, సిబ్బంది



నందిగామ: జెండాకు వందనం చేస్తున్న తహసీల్దార్ రాజేశ్వర్, సిబ్బంది



శంకర్‌పల్లి: మున్సిపల్ కార్యాలయంలో..



శంకర్‌పల్లి: వ్యవసాయశాఖ కార్యాలయంలో..



షాబాద్‌: కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద..



షాద్‌నగర్‌రూరల్: జెండాను ఎగురవేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



చేవెళ్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద..

తెరుచుకున్న పశువైద్య ఉపకేంద్రం

సాక్షి ఎఫెక్ట్..

మొయినాబాద్‌: గత ఐదేళ్లుగా మూతపడిన పశువైద్య ఉపకేంద్రం ఎట్టకేలకు తెరుచుకుంది. మండలంలోని వెంకటాపూర్ పశువైద్య ఉపకేంద్రం సిబ్బంది కొరతతో గత ఐదేళ్ల క్రితం మూతబడడంతో పరిసర గ్రామాల రైతులు, పశుపోషకులు పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి' దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితం కావడంతో పశుసంవర్ధక శాఖ అధికారులు స్పందించారు. పశువైద్య ఉపకేంద్రానికి లైవ్ స్టాక్ అసిస్టెంట్(ఎల్ఎస్ఏ)గా శ్రీనివాస్‌ను పదోన్నతిపై పంపారు. నెలరోజుల క్రితమే ఉత్తర్వులు జారీ చేయగా శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. కానీ ఆ ఉపకేంద్రం తెరుచుకోలేదు. ఎట్టకేలకు స్థానిక రైతుల సహకారంతో పశువైద్య ఉపకేంద్రాన్ని శుభ్రం చేసి సోమవారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించి జాతీయ జెండాను ఎగురవేశారు. ప్రతి రోజు రైతులకు అందుబాటులో ఉంటామని ఎల్ఎస్ఏ శ్రీనివాస్ తెలిపారు.



పశువైద్య ఉపకేంద్రం వద్ద జెండాను ఎగురవేస్తున్న సిబ్బంది, రైతులు

రైతు సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: రైతన్నల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఇన్‌చార్జి ఏడీఏ నిషాంత్‌కుమార్ ఆధ్వర్యంలో సర్కార్ అందజేసిన విత్తనాలను ఆయన రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు అధిక దిగుబడులను సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన వరి, జొన్న విత్తనాలను పంపిణీ చేస్తోందన్నారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కొనుగోలు విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా రైతులు మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ఆశ్రయించవచ్చని సూచించారు. పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు

షాద్‌నగర్‌రూరల్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని గ్రేడ్–1 గ్రంథాలయాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజానికి జ్ఞానాన్ని అందించేందుకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థుల నుంచి మేధావుల వరకు ప్రతి ఒక్కరూ చదువుకునే పుస్తకాలు ఉంటాయన్నారు. గ్రంథాలయాలను యువకులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయ కమిటీ చేపడుతున్న పుస్తక సేకరణ కార్యక్రమం ఎంతో గొప్పదని, ఆ కార్యక్రమానికి ఎమ్మెల్యే రూ.20వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరి

ఏసీపీ కిషన్

షాబాద్‌: వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని చేవెళ్ల ఏసీపీ కిషన్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని సర్దార్‌నగర్ మార్కెట్ ఆవరణలో కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పశువుల క్రయ, విక్రయాల వ్యాపారులు, రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బక్రీద్ సందర్భంగా సర్దార్‌నగర్ పశువుల సంతలో క్రయ, విక్రయాల్లో వ్యాపారులు, రైతులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండుగ రోజు ఆవులను వధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పీసరి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బక్రీద్‌ను పురస్కరించుకొని వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ ఆదేశాను సారం జంతువుల అక్రమ రవాణాతో తలెత్తే శాంతి భద్రతల సమస్యలను నివారించడానికి ఈ నెల 3వ తేదీ మంగళవారం రోజు పశువుల సంతను బంద్ చేస్తున్నామన్నారు. జంతు సంక్షేమ చట్టాలు, నిబంధలను కఠినంగా అమలు చేసేందుకు పండుగ వరకు పశువుల సంత పరిధిలో తెల్ల పశువులు ముఖ్యంగా ఆవులు, దూడల వ్యాపారాన్ని నిలిపివేయాలని ఆదేశించారని తెలిపారు. రైతులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఎట్టి పరిస్థితుల్లో సంతకు పశువులను తీసుకురావొద్దని సూచించారు. కార్యక్రమంలో సీఐ కాంతారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అక్తర్‌పాషా, శ్రీరాంరెడ్డి, సంజీవరెడ్డి, నర్సింలుగౌడ్, సంతోష్, వ్యాపారులు, రైతులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ కిషన్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి

అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని ఫిర్యాదు

నందిగామ: మండల పరిధిలోని ఈదులపల్లిలో కొందరు గ్రామ కంఠం భూమిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని చేపట్టారని, వెంటనే నిలిపివేయాలని కోరుతూ గ్రామానికి చెందిన రమేశ్ సోమవారం ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఫిర్యాదు కాపీలను స్థానిక విలేకరులకు అందజేశారు. గతంలో ఆ భూమి పట్టా భూమి అనుకున్నామని, ఇటీవల మండల సర్వేయర్‌తో సర్వే చేయించగా గ్రామ కంఠం భూమిగా నిర్ధారణ అయ్యిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్వే నంబరు 5లో ఇటీవల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా ఇంటి నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నాడని, ఆ నిర్మాణాన్ని నిలిపివేసి గ్రామ అవసరాల కోసం భూమిని కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశాడు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

చేవెళ్ల: మండలంలోని ముడిమ్యాల సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధి చిలుకూరు రెవెన్యూలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన 1998–99 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారందరూ ఒకచోట కలిసి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు.

ఉద్యమకారులు, పాత్రికేయులకు సన్మానం



ఉద్యమకారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఆర్డీఓ సరిత

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ సరిత ఆధ్వర్యంలో సోమవారం ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు, సీనియర్ పాత్రికేయులకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు, సీనియర్ పాత్రికేయులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఉద్యమకారులు అనేక ఇబ్బందులను ఎదుర్కొని స్వరాష్ట్ర సాధనకు అలుపెరగని పోరాటం చేశారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. రాష్ట్ర సాధనలో పాత్రికేయుల పాత్ర కీలకమన్నారు. వారందరినీ సన్మానించడం హర్షణీయమన్నారు. సన్మానం పొందిన వారిలో పాత్రికేయులు మోహన్‌రెడ్డి, ఖాజా పాష, రాఘవేందర్‌గౌడ్ ఉద్యమకారులు గోపాల్‌గుప్తా, వెంకట్రామిరెడ్డి, కరుణాకర్, రవి, దిలీప్, వెంకటేశ్, బీరప్ప, శ్రీహరిగౌడ్, రాము, రవీంద్రనాథ్, నర్సింలు, సురేష్‌గౌడ్, అశోక్ ఉన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

- రైతుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ
- రెండు బృందాలుగా ఏర్పాటు

షాద్‌నగర్: భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఆర్ఓఆర్–2025 భూభారతి చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టంపైనే రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం గ్రామాల్లో రైతుల నుంచి ఫిర్యాదులను తీసుకునేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది.

రెండు బృందాల ఏర్పాటు

రెవెన్యూ సదస్సుల నిర్వహణకు అధికారులు రెండు బృందాలను ఏర్పాటు చేశారు. తహసీల్దార్‌తో పాటుగా నయాబ్ తహసీల్దార్లు, ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్‌లను రెండు టీమ్‌లుగా ఏర్పాటు చేసి సదస్సులు నిర్వహించనున్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలో ఈ నెల 3న నాగులపల్లి, మధురాపూర్, 4వ తేదీన ఎలికట్ట, శేరిగూడ, మధురాపూర్, 5న మొగిలిగిద్ద, రంగసముద్రం, బూర్గుల, 6న కిషన్‌నగర్,గుండ్లకుంట, తిమ్మాజిపల్లి, 9న హాజిపల్లి, చిల్కమర్రి, రామకృష్ణాపూర్, 10న చించోడ్, సోలీపూర్, 11న కమ్మదనం, కంసాన్‌పల్లి, 12న గంట్లవెల్లి, భీమారం, 13న విఠ్యాల, కొండన్నగూడ, కొంగగూడ, 16న రాయికల్, జోగమ్మగడ్డ, దూసకల్, 17న కందివనం, బుచ్చిగూడ, 18న ఫరూఖ్‌నగర్, వెలిజర్ల, 19న అన్నారం, చటాన్‌పల్లి, అలిసాబ్‌గూడ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పార్థసారధి తెలిపారు.



ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రకళ

ఆర్డీఓ చంద్రకళ

చేవెళ్ల: భూ సమస్యలు లేని గ్రామాలుగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందని ఆర్డీఓ చంద్రకళ అన్నారు. చేవెళ్లలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 3వ తేదీ నుంచి 20 వరకు రెవెన్యూ సదస్సులు ప్రారంభం అవుతున్నాయని తెలిపారు. చేవెళ్ల డివిజన్‌లోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ నాలుగు మండలాల్లో గ్రామాల వారీగా నిర్వహించే సదస్సులను రైతులు, భూ యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్, ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ ముగ్గురు కంప్యూటర్ ఆపరేటర్లతో కూడిన అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి ఒక బృందం తహసీల్దార్, మరో బృందం నాయబ్ తహసీల్దార్ ఆధ్వర్యంలో గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తారని తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సదస్సులు షెడ్యూల్ ప్రకారం ప్రతిరోజు ఒక్కో గ్రామంలో ఉంటాయన్నారు. ఇప్పటికే మండలాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహించే తేదీల జాబితాను ప్రకటించటం చామని స్పష్టం చేశారు. రైతులు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదాం

- ఎమ్మెల్యే కాలె యాదయ్య
- వంద రోజుల ప్రణాళిక ప్రారంభం

చేవెళ్ల: రాష్ట్రంలోనే చేవెళ్లను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మున్సిపాలిటీలో సోమవారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కమిషనర్ పూర్ణచందర్‌తో కలిసి ఎమ్మెల్యే జెండా ఆవిష్కరించారు. అనతంరం ర్యాలీ చేపట్టి వేంకటేశ్వరస్వామి ఆలయ పుష్కరిణీ(గుండం) వద్ద వంద రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని మున్సిపాలిటీల్లో వంద రోజుల ప్రణాళిక 2వ తేదీ నుంచి సెప్టెంబర్ 10వ తేదీవరకు కొనసాగుతుందన్నారు. ప్రధాన సమస్యలను గుర్తించి వాటికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. వందరోజుల ప్రణాళిక ఒక మార్పు–అభివృద్ధికి మలుపు అనే నినాదంతో ముందుకు సాగుతుందన్నారు. ఇందులో తడి, పొడి చెత్త సేకరణ, వర్షాకాలంలో పారిశుద్ధ్య నిర్వహణ, హరితవనాలు పెంచటం, రోడ్లకిరువైపులా మొక్కలు నాటడం, హెల్త్ క్యాంపులు, ఇంకుడు గుంతలు, పట్టణ సుందరీకరణ, మహిళా సాధికారత తదితర కార్యక్రమాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. అదేవిధంగా కార్మికులను సన్మానించారు. కార్యక్రమం రాష్ట్ర పోల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, బీఎస్ఎన్ఎల్ బోర్డు సభ్యుడు మానిక్యరెడ్డి, చేవెళ్ల ఆరీడీఓ చంద్రకళ, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు వసంతం, క్రిష్ణారెడ్డి, ఆగిరెడ్డి, పెంటయ్యగౌడ్, వెంకటేశంగుప్తా, బల్వంత్‌రెడ్డి, రాములు, మల్లేశ్, వీరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శంకర్, యాదయ్య, చేవెళ్లసీఐ భూపాల్‌శ్రీధర్, ఎస్ఐలు, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మున్సిపాలిటీలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, కమిషనర్ పూర్ణచందర్, సిబ్బంది